క్లుప్తంగా

స్తంభాల తొలగింపులో సమన్వయ లోపం

ఆత్మకూరు : మండల కేంద్రంలో సీసీ రోడ్లపై వదిలేసిన విద్యుత్ స్తంభాల తొలగింపులో అధికారుల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. స్తంభాల తొలగింపు కోసం రూ.9,56,833 చెల్లించాలని గ్రామ పంచాయతీకి నోటీస్ ఇచ్చామని, కానీ చెల్లించలేదని ఏఈ రవికుమార్ తెలిపారు. అయితే గ్రామ పంచాయతీలో నిధులు లేవని ప్రతినెల రూ.1.50 లక్షల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నామని, అదే భారంగా ఉందని కార్యదర్శి యాదగిరి వివరించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ బల్మూరికి అభినందన



నడికూడ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బల్మూరి వెంకట్ నర్సింగరావును హనుమకొండలోని హరిత కాకతీయ గ్రాండ్ హోటల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ మహబూబ్‌పాషా, వినియోగదారుల సమాచార కేంద్రం మండల అధ్యక్షుడు మహ్మద్ జమాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

లైసెన్స్ పొందాలి

ఆత్మకూరు : మండలంలో అన్ని రకాల దుకాణాదారులు 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధిత గ్రామపంచాయతీ నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి చేతన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 20వ తేదీలోపు షాపు యజమానులు అందరూ లైసెన్స్‌లు పొందాలని కోరారు.

విద్యార్థులకు అతిథి భోజనం



ఐనవోలు : మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్‌లో రంగశాయిపేటకు చెందిన ఇన్‌క్లూజీవ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ) దూసరి భువన్‌కుమార్ తన కూతురు హద్విక పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అతిథి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు మధుకర్, బీమళ్ల సారయ్య, మహేందర్‌రెడ్డి, మహేందర్, లక్ష్మయ్య, సీఆర్‌పీలు రేవతి, రాజ్‌కుమార్, ఐఈఆర్‌పీ వసంత, ఫిజియో డాక్టర్ మమత పాల్గొన్నారు.

అంతిమయాత్రలో 'సిరికొండ'



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జలుగురి రవీందర్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి రవీందర్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని శవపెటికను మోశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బగ్గి రమేష్, కొమ్ముల శివ, గౌస్, కొత్తగట్టు సాయికృష్ణ, రాకేష్ ఉన్నారు.

ల్యాదెళ్లలో గంజాయి ముఠా అరెస్టు

దామెర : పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌లకు గంజాయి విక్రయిస్తున్న ముఠా పట్టుబడింది. ఈ సంఘటన మండలంలోని ల్యాదెళ్ల సమీపంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ల్యాదెళ్ల సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌లకు అన్నపూర్ణ రైస్‌మిల్ నుంచి క్రషర్ వైపునకు వెళ్లే మార్గంలో ఖిలా వరంగల్‌కు చెందిన గద్దల భరత్, పోచమ్మమైదాన్‌కు చెందిన జన్ను విలాస్, జిల్లా అఖిల్ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసుల వాహనాన్ని చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీస్‌లు వారిని పట్టుకొని తనిఖీ చేయగా 140 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకున్న అనంతరం ఆర్‌ఐ సంపత్, జూనియర్ అసిస్టెంట్ మురళి సమక్షంలో పంచనామా నిర్వహించగా నేరం ఒప్పుకున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 3500 ఉంటుందని వెల్లడించారు.

పది దాటినా పత్తాలేని వైద్యసిబ్బంది

- పడిగాపులు కాస్తున్న రోగులు
- ఆవరణలో పడేసిన మందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

శాయంపేట : ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో నిరుగారుతోంది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఉదయం 10 గంటలు దాటినా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. డాక్టర్లు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని, సమయపాలన పాటించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్, హెల్త్ అసిస్టెంట్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ ఇతర సిబ్బంది ఉదయం 10గంటలు దాటినా హాజరుకాకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు వెనుదిరిగారు. పేరుకు 24గంటల ఆస్పత్రి అయినప్పటికీ కనీసం 12గంటలు కూడా వైద్య సేవలు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సబ్‌సెంటర్‌లల్లో కూడా సిబ్బంది సమయపాలన పాటించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బీపీ, షుగర్, డయాబెటిస్ రోగులు ఉదయమే ఆస్పత్రికి చేరుకుని వైద్య సిబ్బంది కోసం పడిగాపులు కాస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య సిబ్బంది, డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సకాలంలో డాక్టర్లు, సిబ్బంది హాజరై వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు.

ఆవరణలో పడేసిన మందులు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా కేంద్రం నుంచి మందులు పంపిస్తారు. ఉదయం పది గంటలకు వాహనం వచ్చినప్పటికీ వైద్య సిబ్బంది ఎవరు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రి ఎదుట ఆవరణలో పడేసి వెళ్లారు. దీంతో సిబ్బంది పనితీరు అద్దం పడుతోంది.



డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ



పీహెచ్‌సీ ఆవరణలో కిందపడేసిన మందుల డబ్బాలు



తెరుచుకోని ల్యాబ్ తలుపులు



వైద్యం కోసం ఎదురు చూస్తున్న రోగుల

డాక్టర్లు అందుబాటులో ఉండాలి



నాది ప్రగతిసింగారం. నాకు కుక్క కరవడంతో వైద్యం కోసం అక్కడి నుంచి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాను. కానీ వైద్య సిబ్బంది ఎవరు అందుబాటులో లేకపోవడంతో గంట నుంచి ఇక్కడే ఉన్నాను. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

-పల్లకొండ రాజయ్య, ప్రగతిసింగారం

గ్రంథాలయ అధికారికి ఘన సన్మానం

పరకాల : ఉద్యోగ విరమణ పొందిన పరకాల గ్రంథాలయ అధికారి నాగమల్ల విశ్వనాథంను పరకాల గ్రంథాలయ పాఠకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పరకాల గ్రంథాలయ అధికారిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విశ్వనాథం పోటీ పరీక్షల పుస్తకాల నుంచి మొదలు పాఠకులకు కావాల్సిన పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు చేసిన కృషి మరువలేనిదని నిరుద్యోగులు, పాఠకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేంద్రప్రసాద్, సూర రాజేందర్, బొచ్చు సందీప్, నూతన్‌కుమార్, యాట రాజేందర్, దాసరి మహేశ్, దుప్పటి లెనిన్, పేర్ల జయశంకర్, పెండెల రవికుమార్, రఘువీర్, కుమార్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథాన్ని సన్మానిస్తున్న పాఠకులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ములుగు రోడ్డు సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం బాల్యంలో జరిగిన సంఘటనలు గుర్తుచేసుకొని ఆహ్లాదంగా గడిపారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సరదాగా గడిపారు. దాదాపు 30 సంవత్సరాల తరువాత కలుసుకున్న సందర్భంగా గ్రూప్‌ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, సారయ్య, ప్రభాకర్‌రాజు, శేరయ్య, సతీష్, శోభారాణి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సిలువేరు జనార్దన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ప్రవీణ్, శ్రీనివాస్, ఉమారాణి, శివకుమార్, సంతోష్, శ్రీనివాస్, రవి, రమణాచారి, రాధిక, రాజేశ్వరి, మోహన్, శ్రీనివాస్, దామెర, ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపూర్, కొత్తపేట, తక్కళ్లపహాడ్, ఒగ్లాపూర్, నడికూడ గ్రామల నుంచి సుమారు 100 మంది పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యం

- ఎమ్మెల్యేలు గండ్ర, రేవూరి



శాయంపేట : కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



పరకాల : ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

శాయంపేట : కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనాయణరావు, పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు ముక్కెర అనూష, దేవనాడి యశోద, మాజీ ఎంపీటీసీ కోసరి గోపాల్ తోపాటు వార్డుసభ్యులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారు కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే సత్యనారాయణరావు తెలిపారు. తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : సోదా రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ, 6వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉడుత శివ, బీసీసెల్ అధ్యక్షుడు ముదిగొండ భిక్షపతితో పాటు 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీల ఎన్నిక



ఐనవోలు : మండల కేంద్రంతోపాటు పెరుమాండ్లగూడెంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లుగా మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు మంగళవారం తెలిపారు. ఐనవోలు గ్రామాధ్యక్షుడిగా తాటికాయల కుమార్, ప్రధానకార్యదర్శిగా కాటబోయిన అశోక్, యూత్ అధ్యక్షుడిగా బరిగెల అనిల్, పెరుమాండ్లగూడెం అధ్యక్షుడిగా కోల సంపత్, ప్రధాన కార్యదర్శిగా వరగంటి రాములు ఎన్నికై నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, పంథిని ఎంపీటీసీ సోమేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు సురేష్, సదానందం, నాయకులు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

ఆత్మకూరు : మండల కేంద్రంలో మంగళవారం 103వ బూత్‌లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బూత్ అధ్యక్షుడు తోట మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు లీలావతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి క్రీడల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

చలివేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలి

- ఎంపీడీఓ ఆంజనేయులు

పరకాల : ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణంతో పాటు మండలంలోని పోచారం, వెంకటాపూర్, మల్లక్‌పేట, వెల్లంపల్లి గ్రామాల్లో చలివేంద్రాలను ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఎండాకాలం దృష్ట్యా ప్రజల దహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా చలివేంద్రాల ఏర్పాటులో అధికారులు తీసుకుంటున్న చొరవను వివిధ గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



మల్లక్‌పేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భిక్షపతి, కృష్ణమాచార్యులు, తదితరులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణానికి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

శ్రీరామనవమి కరపత్రం ఆవిష్కరణ

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరిస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే సీతారాముల కల్యాణ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, ఆలయ ప్రధాన అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ఉదయం 10.30 గంటల తలంబ్రాలు తీసుకురావడం, 11గంటలకు కంది శ్రీనివాస్‌రెడ్డి ధార్మిక ఉపన్యాసం, 12.5గంటల సీతారాముల కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ కాలయాపన



శాయంపేట : మాట్లాడుతున్న రమణారెడ్డి



ఆత్మకూరు : మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. పరకాల పట్టణంలోని జీఎంఆర్ గార్డెన్స్‌లో శాయంపేట మండల బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి మంగళవారం ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి 120రోజులు గడుస్తున్నా రూ. 2 లక్షల రుణమాఫీ, వరికి రూ. 500 బోనస్, మహిళలకు నెలకు రూ.2500, రైతు భరోసా రూ. 15000 పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో అధిక స్థానాల్లో గెలిపించుకునేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. తాను భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆలయ నిర్మాణం చేపడితే ప్రభుత్వ భూమిని అక్రమంగా తీసుకున్నట్లు ప్రచారం చేశారని, అధికారంలో ఉన్నవారు ఆధారలతో చూపెట్టాలని సవాల్ విసిరారు. తాను దిగజారుడు పనులు చేయమని న్యాయబద్ధంగా ఉంటామని తేల్చి చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మారెపల్లి సుదీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ మృతిని చింతిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : వరంగల్ పార్లమెంట్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మారపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఆయన నివాసంలో మంగళవారం పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, కరెంట్ కట్టింగులు, సాగునీటి సమస్యతో కరువులో కొట్టుమిట్టులాడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సుధీర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా కష్టపడాలని కోరారు. అనంతరం వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒకటేనన్నారు. కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసినవారికి ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి



నాగరాజు(ఫైల్)

వేలేరు: అప్పుల బాధతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పీచరలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బూస నాగరాజు(38) రెండు సంవత్సరాల క్రితం తన వ్యవసాయ భూమి వద్ద రెండు బోర్లు వేశాడు. కానీ బోర్లలో నీరు రాలేదు. దీంతో అప్పులు చేసి బావి తవ్వించగా కొంత నీరు వచ్చింది. ఈ నీటితో తన కున్న 4 ఎకరాలు సాగు చేశారు. అయితే నీరు అందక సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. దీంతో అప్పులు మరింత ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో నెల క్రితం తన గొర్రెలు విక్రయించి కొంత అప్పు తీర్చాడు. మిగతా అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య వనమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఉన్నతమైనది

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

మడికొండ: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఉన్నతమైనదని పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం కాజీపేట మండలం మడికొండ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న బయోసైన్స్ ఉపాధ్యాయురాలు రోజిలీన్ ఉద్యోగ విరమణ సన్మానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతిరెడ్డి మాట్లాడు తూ ప్రభుత్వ ఉద్యోగంలో విరమణ తప్పదని పేర్కొన్నారు. విశ్రాంత జీవితం కుటుంబ స భ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కాజీపేట మండల అధ్యక్షుడు మాల కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరయ్య, హెచ్‌ఎంలు సంధ్యారాణి, మల్లారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బీజేపీ నేతల పరామర్శ



హన్మకొండ: టీఎస్ ఎస్పీడీసీఎల్ మాజీ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు, హనుమకొండ జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్‌రావును బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, సీనియర్ నాయకులు గుండె విజయరామారావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గైనేని రాజన్ పరామర్శించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల్‌రావు మనువడు, అనిల్‌చందర్‌రావు కుమారుడు మేహాంశ్ మృతి చెందాడు. మంగళవారం విద్యుత్‌నగర్‌లోని వారి స్వగృహానికి చేరుకుని పరామర్శించారు.